## క్లుప్తంగా

### నేడు మండల సర్వసభ్య సమావేశం

ఇబ్రహీంపట్నం: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రభు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

### 80 వేల క్వింటాళ్ల ధాన్యం సేకరణ

పెగడపల్లి: పెగడపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో శుక్రవారం వరకు 80 వేల క్వింటాళ్ల ధాన్యం సేకరించినట్లు సీఈవో తడుకమడ్ల గోపాల్‌రెడ్డి తెలిపారు. పెగడపల్లిలో 18,500 దోమలకుంటలో 6వేలు, ఆరవెల్లిలో 13వేలు, మద్దులపల్లిలో 14,400, వెంగళాయిపేటలో 2,200, సుద్దపల్లిలో 5వేలు, లింగాపూర్‌లో 6వేలు, శాలపల్లిలో 2,500, ఏడుమోటలపల్లిలో 8వేలు, కొండాయపల్లిలో 5వేలు క్వింటాళ్ల చొప్పున సేకరించినట్లు చెప్పారు. ఇందులో నుంచి 75వేల క్వింటాళ్ల ధాన్యం మిల్లర్లకు తరలించామని, 5వేల క్వింటాళ్ల ధాన్యం కేంద్రాల్లో నిల్వ ఉన్నట్లు వివరించారు.

### ఆర్థిక సాయం


ఆర్థిక సాయం చేస్తున్న సభ్యులు

మెట్‌పల్లి: పట్టణ వెల్డింగ్, ఇంజినీరింగ్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యుడు యామ సుధాకర్ ఇటీవల మరణించాడు. అతడి కుటుంబానికి శుక్రవారం అసోసియేషన్ తరఫున రూ.75వేల ఆర్థిక సాయం చేశారు. పలువురు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న సభ్యుల కుటుంబాలకు అసోసియేషన్ అండగా ఉంటుందన్నారు. అధ్యక్షులు సలీం, ఆరపేట శ్రీనివాస్, కొండ మురళి, మ్యాడారపు శ్రీనివాస్, శ్రీగద్ది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఎయిడ్స్‌కు నివారణ ఒక్కటే మార్గం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రాజారత్నాకర్ తదితరులు

మెట్‌పల్లి: ఎయిడ్స్‌కు నివారణ ఒక్కటే మార్గమని సైకాలజిస్ట్ డాక్టర్ రాజారత్నాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో శుక్రవారం ఎయిడ్స్ దినోత్సవం నిర్వహించారు. చికిత్స లేని ఎయిడ్స్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. గట్టయ్య, దశరథం, మధు, గణేశ్, నాగేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

**ఎయిడ్స్ అంటువ్యాధి కాదు**


జగిత్యాల: పాల్గొన్న విద్యార్థులు

జగిత్యాల: ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని నలంద కళాశాల ప్రిన్సిపాల్ శ్రీపాద నరేశ్ అన్నారు. ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నలంద కళాశాలలో జాతీయ సేవ పథకం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ వ్యాధి ఎలా నివారించుకోవచ్చో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ సురేశ్, జగదీశ్వర్, జాన్, శేఖర్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

జగిత్యాలటౌన్/జగిత్యాలరూరల్: వైజ్ఞానిక ప్రదర్శనలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలతో పాటు రూ.6,000 ప్రోత్సాహక బహుమతి అందజేశారు. 2023 సంవత్సరానికి గాను కార్మెల్ అకాడమీ కాంక్లేవ్‌లో భాగంగా 30 మౌంట్ కార్మెల్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ధరూర్‌లోని మౌంట్ కార్మెల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్ అత్యుత్తమ ప్రదర్శనగా నిలిచింది. 9వ తరగతి విద్యార్థినులు జి.జస్మిత, జి.అక్షిత రూపొందించిన ఆక్వాకల్చర్ ఇన్ అగ్రికల్చర్(పొలాల్లో చేపల పెంపకం) ప్రయోగం అగ్రస్థానంలో నిలిచింది. ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిమారియా శుక్రవారం ప్రతిభా పురస్కారంతో పాటు రూ.6,000 ప్రోత్సాహక బహుమతి అందజేసి అభినందించారు. ఫాదర్ జోసెఫ్‌రెడ్డి, సిస్టర్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ధర్మపురి పీఠం దక్కేదెవరికో..

- రెండు పార్టీల మధ్య హోరాహోరీ
- రసవత్తరంగా ఎన్నికల పోటీ
- రేపటి ఫలితాలపై ఉత్కంఠ


అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ (కాంగ్రెస్ అభ్యర్థి)


కొప్పుల ఈశ్వర్ (బీఆర్‌ఎస్ అభ్యర్థి)


ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ముఖద్వారం

ధర్మపురి: నెల రోజుల నుంచి సాగిన ఎన్నికల ప్రచార హోరు ఈనెల 27తో ముగిసింది. ధర్మపురిలో మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులున్నా.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల మధ్య హోరాహోరీ సాగింది. ఈనెల 30న జరిగిన ఎన్నికల పోలింగ్‌లో విజయం ఎవరికి దక్కుతుందోనని ఎదురుచూస్తున్నారు. ధర్మపురి నియోజకవర్గంలో ఏడు మండలాలుండగా.. ఎస్సీ రిజర్వ్‌గా గుర్తించారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 2,26,880 ఓటర్లుండగా.. పురుషులు 1,11,172, స్త్రీలు 1,15,702, థర్డ్ జెండర్ ఆరుగురున్నారు. అత్యధికంగా ధర్మపురిలో 47,137, అత్యల్పంగా బుగ్గారం మండలంలో 17,800 ఓట్లున్నాయి. నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఓటర్లలో అత్యధికం మహిళలదేనని చెప్పొచ్చు.

**15 మంది బరిలో..**

శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన వారిలో మొదట 18 మంది నామినేషన్లు సమర్పించగా.. విత్‌డ్రా నాటికి ముగ్గురు పోటీ నుంచి తప్పుకున్నారు. 15 మంది అభ్యర్థులు బరిలో నిలిచి పోటీకి సిద్ధమయ్యారు. ప్రధాన పార్టీలు బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లుండగా.. మిగతా స్వతంత్ర, ఇతర పార్టీల వారు పోటీలో నిలిచారు. ఈనెల 30న జరిగిన ఎన్నికల పోలింగ్‌లో గెలుపు తమకే దక్కుతుందని ఆశల్లో తేలిపోతున్నారు. చివరగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లో ఏదో ఒకటి పీఠం దక్కించుకోనుందని అంటున్నారు.

**ఎవరి ధీమా వారిది..**

గెలుపుపై ఎవరి ధీమా వారే వ్యక్తం చేస్తున్నారు. 2009 నుంచి 2018 వరకు వరుసగా విజయాలు సాధించిన బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, ధర్మపురి నియోజకవర్గానికి తాను చేసిన అభివృద్ధే తిరిగి గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కొప్పుల చేతిలో వరుసగా పరాజితమౌతున్నా.. నాటి నుంచి నేటి వరకు ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజల సమస్యలపై పరిష్కార మార్గానికి కృషి చేసినందుకు కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ఈసారి ప్రజల మద్దతుందని అంటున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ అధిష్టానం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలతో పాటు వరుస ఓటమిని చవిచూడడంతో ఈసారి ఓటర్లు మార్పును కోరుకుంటున్నారని, ఈసారి తప్పక తనకే పీఠం దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**24 గంటల్లో..**

అభ్యర్థుల భవితవ్యానికి మిగిలిందిక 24 గంటలే. ఈనెల 3న ఎన్నికల ఫలితాలు తేలనున్నాయి. పోటీ చేసిన అభ్యర్థులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. ఫలితాలు ఎలా వస్తాయోనని తమలో తామే మనోవేదన చెందుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం వరకు అభ్యర్థుల జాతకాలు బయటపడనున్నాయి.

# రహదారిపై ప్రమాద ఘంటికలు


సారంగాపూర్ అడవుల్లో కూలిపోయిన కల్వర్టు


లక్ష్మీదేవిపల్లి వద్ద రోడ్డును ఆనుకొని ఉన్న కుంట

- పలుచోట్ల దెబ్బతినడంతో వాహనదారుల ఆందోళన

సారంగాపూర్: జగిత్యాల నుంచి సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలకు వచ్చే ప్రధాన రహదారి పలుచోట్ల దెబ్బతినడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల మీదుగా మంచిర్యాల జిల్లా జన్నారం, కలమడుగు ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు ప్రధాన రహదారిని ఆర్‌అండ్‌బీ శాఖ ఏర్పాటు చేసింది. ఈ రహదారి నిత్యం భారీ, అతి భారీ, చిన్న వాహనాలతో రద్దీగా ఉంటుంది. వేలాది వాహనాలు రోజంతా ఈ రహదారిపై నుంచి వెళ్తుంటాయి. గతంలో సింగిల్ తారుతో ఉన్న రహదారిని గోదావరి నదిపై కమ్మునూర్–కలమడుగు వంతెన నిర్మాణం చేసి జగిత్యాల నుంచి కమ్మునూర్ గోదావరి వరకు డబుల్ రహదారిగా నిర్మాణం చేశారు. జగిత్యాల నుంచి కమ్మునూర్ వరకు ఈ రహదారి పొడవు 40 కిలోమీటర్లుంటుంది.

**ప్రమాదాలకు ఆస్కారం**

- నిత్యం వేలాది వాహనాలు నడిచే ఈ రహదారిపై పలుచోట్ల ప్రమాదాలు జరగడానికి ఆస్కారముంది.
- లక్ష్మీదేవిపల్లి గ్రామ శివారులో ప్రధాన రహదారిని ఆనుకొని ఊరకుంట ఉంది. ఈ కుంటలోకి ఎస్‌ఆర్‌ఎస్‌పీ డీ–53 ప్రధాన కాలువ ద్వారా నీరు చేరడానికి ప్రత్యేక తూము ఏర్పాటు చేశారు. కుంట ఎప్పుడు నీటితో నిండి ఉంది. కుంట ప్రధాన రహదారిని ఆనుకొని ఉండడంతో వాహనాదారులు వెళ్లే సమయంలో నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. కుంట వెంట ప్రమాదాలు జరగకుండా సెఫ్టీవాల్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది.
- సారంగాపూర్ అటవీ ప్రాంతంలో ఇరుకు రాళ్ల వద్ద వరద నీరు రోడ్డు కింది నుంచి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన కల్వర్టు చాలావరకు కూలిపోయింది. ఇటీవల ఓ కారు కల్వర్టును ఢీకొనడంతో కల్వర్టు మరింత దెబ్బతింది. కల్వర్టు మీది నుంచి ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారింది.
- పోతారం గ్రామ శివారులోని బృహత్ పల్లె ప్రకృతి వనం వద్ద కల్వర్టుకున్న సెఫ్టీవాల్స్ పూర్తిగా కూలిపోయాయి. కూలిపోయిన ప్రాంతం కనిపించకుండా మొత్తం చెట్లు, ముళ్లపొద లున్నాయి. వాహనదారులకు కూలిపోయిన కల్వర్టు కనిపించడం లేదు.
- బీర్‌పూర్ ఘాట్‌పై పలు మలుపులున్నాయి. కొన్నిచోట్ల ఇనుప బారికేడ్లు ఏర్పాటు చేసినా.. ఇంకా ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలున్నాయి.
- బీర్‌పూర్ వైపు ఘాట్ దిగే సమయంలో 200 మీటర్ల తారు రోడ్డు పూర్తిగా శిథిలమై గుంతలతో నిండిపోయింది. తక్షణమే మరమ్మతు చేపట్టాల్సి ఉంది.
- కోనాపూర్ వాగుపై ఏర్పాటు చేసిన హైలెవల్ వంతెన పనులు అసంపూర్తిగా ఉన్నాయి. తక్షణమే పనులు చేపట్టి వంతెన నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.
- తాళ్లధర్మారం గ్రామం హైలెవల్ వంతెన వద్ద రహదారికి కొంతమేర మరమ్మతులు జరపాల్సి ఉంది.

### మరమ్మతు చేపట్టాలి



సారంగాపూర్ అడవుల్లో ఇరుకు రాళ్ల ప్రాంతంలో కల్వర్టు ఒక పక్క కూలిపోయి చాలా ప్రమాదకరంగా ఉంది. దీనికి మరమ్మతులు తక్షణమే చేపట్టాలి.
– ఆసాది హరీష్, రేచపల్లి

### టెండర్లు పిలిచాం



లక్ష్మీదేవిపల్లి కుంట రహదారిని ఆనుకొని ఉంది. ప్రమాదాలు జరగకుండా సెఫ్టీవాల్స్ నిర్మించడానికి మళ్లీ టెండర్లు పిలిచాం. ఎన్నికల ప్రక్రియ పూర్తి అయింది. పనులు ప్రారంభిస్తాం. కోనాపూర్ వంతెన పనులు త్వరలో ప్రారంభిస్తాం. సారంగాపూర్ అడవుల్లో కూలిపోయన కల్వర్టు వద్ద మరమ్మతు చేయడానికి చర్యలు తీసుకుంటాం.
– రాజశేఖర్, ఆర్‌అండ్‌బీ ఏఈ, సారంగాపూర్, బీర్‌పూర్



### పొంచి ఉన్న ప్రమాదం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం నుంచి గొధూర్ వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఇబ్రహీంపట్నం శివారు డీ-24 కాలువ వంతెనపై గుంత ఏర్పడింది. ఈ దారి గుండా ప్రతిరోజు వందలాది వాహనాలు మెట్‌పల్లి వైపు వెళ్తుంటాయి. రాత్రి సమయంలో వాహనదారులకు ప్రమాదం జరిగే అవకాశాలున్నాయి. వెంటనే ఆర్‌అండ్‌బీ అధికారులు దాన్ని పూడ్చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### అయ్యప్ప పడిపూజ

మల్లాపూర్: గుండంపల్లి గ్రామానికి చెందిన మార్గం గంగారెడ్డి స్వగృహంలో శుక్రవారం అయ్యప్ప పడిపుజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పురోహితుడు మారుతి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వాముల శరణుఘోషతో ఆ ప్రాంగణమంతా మారుమోగింది. ఓం శ్రీ స్వామియే శరణమయ్యప్ప.. స్వామి శరణం.. అయ్యప్ప శరణం అంటూ భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. అనంతరం భిక్ష ఏర్పాటు చేశారు. లక్ష్మారెడ్డి, రాంప్రసాద్, సుధాకర్, రాజేశ్‌కుమార్, నాసం తిరుపతి, మార్గం శరత్, గ్రామస్తులు పాల్గొన్నారు.


భజన చేస్తున్న స్వాములు

## అటెన్షన్ ప్లీజ్


మల్యాల అడ్డ రోడ్డు వద్ద ప్రధాన రహదారి పక్కన గుంత

### గుంతలతో తిప్పలు

మల్యాల: జగిత్యాల–కరీంనగర్ జాతీయ ప్రధాన రహదారి వెంట గుంతలు ప్రమాదకరంగా మారాయి. మల్యాల మండలం అడ్డ రోడ్డు వద్ద, వీఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో రోడ్డు పక్కన భారీ గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు కనీసం తాత్కాలికంగానైనా చర్యలు చేపట్టి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

### పోలింగ్ సరళిపై గల్ఫ్ దేశాల నుంచి ఆరా

రాయికల్: జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలపై గల్ఫ్ దేశాల్లో ఉంటున్న కార్మికులు ఎప్పటికప్పుడు ఫోన్ల ద్వారా కుటుంబ సభ్యులను ఆరా తీస్తూ ఏ పార్టీకి మెజార్టీ వచ్చే అవకాశముందో తెలుసుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో బెట్టింగులు సైతం నిర్వహిస్తున్నారు. ఏదేమైనా తెలంగాణలో జరుగుతున్న ఎన్నికలతో గల్ఫ్ దేశాల్లోని కార్మికుల్లో ఉత్కంఠ నెలకొంది.

### జోరుగా బెట్టింగులు

జగిత్యాలరూరల్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల పోలింగ్ ముగియడంతో జగిత్యాల నియోజకవర్గంలోని పలువురు నాయకులు, సీనియర్ కార్యకర్తలు తమ నాయకుడే గెలుస్తాడంటూ రూ.లక్షల్లో బెట్టింగులకు పాల్పడుతున్నారు. తమకే మెజార్టీ వస్తుందని ఇరువర్గాలవారు వాదనలకు దిగుతూ బెట్టింగులకు పాల్పడుతున్నారు. ఓ గ్రామానికి చెందిన నాయకుడు తమ నాయకుడు ఓడిపోతే రాజకీయం నుంచి వైదొలుగుతానని సవాల్ విసిరాడు. మరో నాయకుడు తమ నాయకుడు గెలిస్తే గోవా టూర్ తీసుకెళ్లి ఎంత ఖర్చైనా పెడతానంటూ హామీ ఇవ్వగా.. మరికొంతమంది నాయకులు రూ.లక్షల్లో బెట్టింగులకు దిగారు. మధ్యవర్తుల ద్వారా బెట్టింగ్ పెట్టి గెలుపోటములపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

### మహిళలదే హవా..

- కోరుట్ల నియోజకవర్గంలో 75.62 శాతం పోలింగ్

కోరుట్లరూరల్: కోరుట్ల నియోజకవర్గంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 75.62 శాతం పోలింగ్ నమోదైంది. పురుషుల కంటే ఎక్కువగా 21,432 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో పురుషులు 1,15,027, మహిళలు 1,25,824, ఇతరులు 4 మొత్తం 2,40,855 లక్షల మంది ఓటర్లున్నారు. ఈ ఎన్నికల్లో 1,82,140 ఓట్లు పోలయినట్లు అధికారులు తెలిపారు. పురుషులు 80,353 మంది, మహిళలు 1,01,785 మంది, ఇతరులు ఇద్దరు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇబ్రహీంపట్నం మండలంలో 24,757 ఓట్లు పోలవగా.. 81.23 శాతం, కోరుట్ల మండలంలో 24,548 ఓట్లకు 80.59, కోరుట్ల పట్టణంలో 41,392కు గాను 69.56, మల్లాపూర్ మండలంలో 33,205 కాగా 82.54, మెట్‌పల్లి మండలంలో 28,657 పోలవగా 79.35, మెట్‌పల్లి పట్టణంలో 29,581 ఓట్లు పడగా 67.13 శాతం పోలింగ్ నమోదైంది.

### అభ్యర్థులను కలిసేందుకు వెళ్లిన నేతలు

కథలాపూర్: వేములవాడలో ఎమ్మెల్యే అభ్యర్థులను కలిసేందుకు కథలాపూర్ మండలంలోని బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు శుక్రవారం వెళ్లారు. గ్రామాల్లో పోలైన ఓట్ల వివరాల జాబితాలను తీసుకెళ్లి అభ్యర్థులకు వివరించారు. ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయనే విషయాలపై చర్చించారు. పెద్ద గ్రామాల్లో తమకే అధికంగా ఓట్లు వస్తాయని మూడు పార్టీల నాయకులు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తుండటం విశేషం. మరోవైపు పోలింగ్ రోజు సొంత పార్టీ నాయకులు ఎవరైనా ఇతర పార్టీలకు అంతర్గతంగా మద్దతు ఇచ్చారా అనే విషయాలపై నేతలు చర్చించుకున్నట్లు తెలిసింది. గెలుపుపై బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ ధీమా వ్యక్తం చేస్తుండగా.. వేములవాడ నియోజకవర్గంలో త్రిముఖ పోటీ నెలకొందని ప్రజలు పేర్కొంటున్నారు. దీంతో ఫలితాలు వెల్లడయ్యేవరకు రాజకీయ నాయకులు, ప్రజల్లో ఉత్కంఠ నెలకొనునుంది.

### చిత్ర కథ: వాళ్లు నాటుడు.. వీళ్లు నరుకుడు..



బుగ్గారం: రాష్ట్రంలో ప్రస్తుతం 24 శాతంగా ఉన్న అడవుల విస్తీర్ణాన్ని కనీసం 33 శాతం వరకు పెంచాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం హరితహారం చేపట్టింది. దీనిలో భాగంగా రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో 10 దశల్లో విస్తృతంగా మొక్కలు నాటారు. దీని కోసం ఉన్నతాధికారులు లక్ష్యాలిచ్చి మరీ పెద్దఎత్తున వివిధ ప్రాంతాల్లో మొక్కలను నాటించారు. అయితే పలు ప్రాంతాల్లో నాటిన మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగి విద్యుత్ తీగలకు అడ్డుగా వస్తుండడంతో విద్యుత్ అధికారులు వాటిని నరికేస్తున్నారు. ఏపుగా పెరిగిన చెట్లను నరికేయడంతో పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ప్రాంతాల్లో మొక్కలను నాటడం ఎందుకు, ఆపై నరకడం ఎందుకని అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇలాగైతే ప్రభుత్వ లక్ష్యం ఎలా నెరవేరుతుందని వాపోతున్నారు.